

రహదారిపై కొనసాగుతున్న డ్రైనేజీ పనులు

డ్రైనేజీ పైపులైన్ పనులను చేపట్టిన అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చంపాపేట, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : హస్తినాపురం డివిజన్ డీఎమ్ఆర్ఎల్ చౌరస్తాలోని పోచమ్మగడ్డలోని ఎయిర్‌పోర్టుకు వెళ్లే ప్రధాన రహదారిపై జలమండలి అధికారులు నూతనంగా డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులు చేపట్టారు. ఈ నెల 8న ఆంధ్రజ్యోతిలో వచ్చిన 'పొంగుతున్న డ్రైనేజీలు.. కంపుకొడుతున్న ఆలయ ప్రాంగణం' అనే వార్తకు అధికారులు స్పందించారు. ప్రధాన రహదారిపై ఉన్న భందన ప్రసన్నాంజనేయస్వామి ఆలయం ఎదుట డ్రైనేజీలు పొంగుతుండటంతో భక్తులు నానా ఇబ్బందులకు గురైన విషయం విధితమే. దీంతో పాటు కాలనీలో డ్రైనేజీ నీరు ఎటు వెళ్లలేక మడుగులా నిలిచాయి. ప్రజల రాకపోకలకు విఘాతంతో పాటు మూడు రోజులుగా దుర్వాసన వెదజల్లుతుంది. బుధవారం డ్రైనేజీ నిర్మాణం కోసం జేసీబీతో గొయ్యి తీసి పైపులు వేసే కార్యక్రమాన్ని చేపట్టారు.


శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ లచ్చిరెడ్డి

పార్కులను అభివృద్ధి చేస్తా : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం, జూలై 10(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని పార్కులను అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం బీఎన్ రెడ్డినగర్ డివిజన్‌లోని టీచర్స్‌కాలనీ ఫేజ్-1 నార్త్ వెల్ఫేర్ అసోసియేషన్ భవనం మొదటి అంతస్తు ప్రారంభోత్సవం, టీచర్స్‌కాలనీ ఫేజ్-2లో వాకింగ్ ట్రాక్, పార్కు సుందరీకరణ పనులు, బీఎన్‌రెడ్డినగర్‌కాలనీలో పార్కు సుందరీకరణ పనులు, వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులకు బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎల్బీనగర్ నియోజకవర్గంలో ఉన్న పార్కులు, స్విమ్మింగ్ పూల్స్, ప్లేగ్రౌండ్స్ మరెక్కడా లేవన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, కాలనీల అధ్యక్షులు కొత్త శివ ముదిరాజ్, తూంబూపాల్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, మోహన్‌రెడ్డి, నక్క వెంకటస్వామియాదవ్, గడ్డం మల్లేష్‌గౌడ్, బుచ్చిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, పోగుల రాంబాబు, రాఘవేందర్‌రావు పాల్గొన్నారు.


బోనాల ఏర్పాట్లపై అభిప్రాయాలు తెలుసుకుంటున్న మేయర్ పారిజాతారెడ్డి

బోనాల ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తాం: పారిజాతారెడ్డి

సరూర్‌నగర్, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాస బోనాల ఉత్సవాల నిర్వహణ కోసం బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని ప్రధాన ఆలయాల వద్ద అన్ని ఏర్పాట్లు చేయనున్నట్టు మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆమె నాదర్‌గుల్ 19వ డివిజన్‌లోని ఈదమ్మ, ఎల్లమ్మ ఆలయాలను సందర్శించి అక్కడ చేయాల్సిన ఏర్పాట్లపై స్థానికులతో చర్చించారు. ఆలయాల పరిసరాలను పరిశుభ్రంగా తయారు చేయాలని, రోడ్లను బాగు చేసి భక్తులు ఎలాంటి ఇబ్బంది లేకుండా బోనాలతో ఆలయాలకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రామోజీ అమితాశ్రీశైలంచారి, పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, మునిసిపల్ డీఈఈ జ్యోతిరెడ్డి, ఏఈ బిక్క్యానాయక్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వీ.యాదగిరి, కాలనీ ప్రతినిధులు మనోహర్, గిరిముదిరాజ్, భానుప్రసాద్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయించాలి


జీహెచ్ఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి

వనస్థలిపురం, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : డివిజన్‌లోని కాలనీల్లో సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయించి అభివృద్ధికి తోడ్పాటును అందించాలని కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వనస్థలిపురం డివిజన్‌లోని సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేసి అభివృద్ధికి కృషి చేయాలని కోరామని తెలిపారు. డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తానని కమిషనర్ తెలిపారని కార్పొరేటర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు కాలనీల అధ్యక్షులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

అల్తాఫ్‌నగర్, శ్రీనివాసకాలనీల్లో కార్పొరేటర్ పర్యటన

ఎల్బీనగర్, జూలై 10(ఆంధ్రజ్యోతి): లింగోజిగూడ డివిజన్ పరిధిలోని అల్తాఫ్‌నగర్, శ్రీనివాసకాలనీల్లో కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి బుధవారం పర్యటించారు. కాలనీల్లో స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన తెలుసుకున్నారు. రోడ్డు పనులను పరిశీలించారు. పనులను నాణ్యతతో చేపట్టాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకెళ్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అల్తాఫ్‌నగర్‌కాలనీ ప్రతినిధులు జనార్దన్‌రెడ్డి, జంగారెడ్డి, వెంకట్‌రెడ్డి, మహేందర్, కిరణ్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, జంగయ్యగౌడ్, షఫీ, శ్రీనివాసకాలనీ ప్రతినిధులు సురేష్, రాజు, రవి, నాగేశ్వర్‌రావు, జానకీరామారావు పాల్గొన్నారు.

'పాఠశాల సివరేజీని బ్లాక్ చేయడం సహించరానిది'

వనస్థలిపురం, జూలై 10(ఆంధ్రజ్యోతి): పాఠశాల సివరేజీని జలమండలి అధికారులు బ్లాక్ చేయడం సహించరానిదని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం నాగోల్ డివిజన్ బాలాజీనగర్‌లోని జాన్సన్ గ్రామర్ స్కూల్‌కు తాగునీటి కనెక్షన్ లేదనే సాకుతో రెండు నెలలుగా ఉద్దేశపూర్వకంగా టార్గెట్ చేసి సివరేజీ వ్యవస్థను బ్లాక్ చేయడం ఏంటని సంబంధిత అధికారులను కార్పొరేటర్ ప్రశ్నించారు. అప్పట్లో గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీ, జీహెచ్ఎంసీ ద్వారా అన్ని రకాల పర్మిషన్లు తీసుకోవడం జరిగిందన్నారు. పాఠశాల సివరేజీ నిర్వహణకు 2021లో జలమండలి పర్మిషన్ తీసుకున్నప్పటికీ అధికారులు ఇబ్బందులు పెట్టడం సరైంది కాదన్నారు. 2007లో జాన్సన్ గ్రామర్ స్కూల్‌కు లీగల్‌గా అన్ని రకాల అనుమతులకు చార్జీలు చెల్లించినా టార్గెట్ చేయడం ఏంటన్నారు. ఈ మేరకు తక్షణమే స్పందించిన అధికారులు పాఠశాలలో బ్లాక్ చేసిన సివిరేజీని తాత్కాలికంగా ఓపెన్ చేశారు. కార్యక్రమంలో బాలాజీనగర్ అధ్యక్షుడు లక్ష్మయ్య, గోపాల్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు

చంపాపేట, జూలై 10(ఆంధ్రజ్యోతి): ప్రజల అవసరాలకు అనుగుణంగా కాలనీలు, బస్తీలలో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి అన్నారు. చంపాపేట డివిజన్‌లోని కర్మన్‌ఘాట్ ఓల్డ్ విలేజీ, శుభోదయకాలనీలలో బుధవారం జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి కార్పొరేటర్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్మన్‌ఘాట్ భగత్‌సింగ్ యువజన సంఘం నుంచి సరస్వతి హైస్కూల్ మీదుగా కర్మన్‌ఘాట్ వైఎస్సార్ విగ్రహం వరకు, చంపాపేట ప్రధాన రహదారి జామామసీదు నుంచి మోడల్ మార్కెట్ మీదుగా చంపాపేట చౌరస్తా వరకు స్టామ్ వాటర్ డ్రైన్ నిర్మాణం చేపట్టాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఎస్ఈ అశోక్‌రెడ్డి, ఈఈ కార్తీక్, డీఈ రఫి, ఏఈ సురేష్, నాయకులు సుంకరి రమేష్‌గౌడ్, లింగాల దశరథ్‌గౌడ్, వేణుగౌడ్, బసంత్, కాలనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

దోమల నివారణకు సిద్ధం కావాలి

● అధికారులకు జడ్సీ పిలుపు

ఎల్బీనగర్, జూలై 10(ఆంధ్రజ్యోతి): దోమలపై దండయాత్రకు అన్ని విభాగాల అధికారులు సిద్ధం కావాలని జీహెచ్ఎంసీ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ పిలుపునిచ్చారు. దోమల నివారణ - వాటి ద్వారా వ్యాపించే వ్యాధులపై బుధవారం జోనల్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో నీరు నిలువ ఉండే ప్రాంతాల్లో దోమలు వృద్ధి చెందే ప్రమాదమున్నదన్నారు. దోమలు వృద్ధి చెందకుండా ఉండేందుకు యాంటీలార్వా చర్యలు చేపట్టడంతో పాటు ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. కాలనీలు, బస్తీల వారీగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తు దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను ప్రజలకు వివరించాలని ఆయన సూచించారు. విద్యాసంస్థల్లో కూడా దోమల నివారణపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించాలన్నారు. వచ్చే మూడు రోజుల్లో విద్యాసంస్థల్లో కార్యక్రమాలు పూర్తి చేయాలని ఆదేశించారు. ఏఏ కారణాల వల్ల దోమలు వృద్ధి చెంది వ్యాపిస్తాయో వాటిని ఎలా నిలువరించాలో వారికి వివరించాలన్నారు. చెరువులు, కాల్వల పరిసరాలలో ఉన్న బస్తీలు, కాలనీల్లో ముందుగా యాంటీ లార్వా కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేయడం నిలువ ఉన్న నీటిని తొలగించడం వంటి చర్యలు చేపట్టాలన్నారు. డెంగీ అనుమానిత ప్రాంతాలలో ఫివర్ సర్వే చేపట్టాలని ఆయన సూచించారు. ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటించేలా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఈ సదస్సులో జీహెచ్ఎంసీ ఎస్ఈ అశోక్‌రెడ్డి, డీసీ(ఎస్‌డబ్ల్యూఎం) సువార్త, ఉప కమిషనర్లు ముకుంద్‌రెడ్డి, తిప్పర్తి యాదయ్య, జకియా సుల్తానా, సుజాత పాల్గొన్నారు.


సదస్సులో పాల్గొన్న అధికారులు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్

ఎలక్ట్రికల్ వర్కర్స్ సంక్షేమానికి కృషి : ఎమ్మెల్యే సబితారెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

సరూర్‌నగర్, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రికల్ వర్కర్స్ సంక్షేమం కోసం తన శాయశక్తులా కృషి చేస్తానని, వారికి ఏ ఆపద వచ్చినా తాను ముందుండి ఆదుకుంటానని మహేశ్వరం ఎమ్మెల్యే పీ.సబితారెడ్డి అన్నారు. తెలంగాణ ప్రైవేటు ఎలక్ట్రికల్ టెక్నీషియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడలో గల ఏపీఆర్ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన ప్రముఖ ఎలక్ట్రికల్ టెక్నీషియన్, విద్యుత్ మార్గదర్శకుడు టెస్లా నికోలా జయంతి వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా సబిత మాట్లాడుతూ ఎలక్ట్రికల్ టెక్నీషియన్స్ యూనియన్ భవనం కోసం 150 గజాల స్థలం ఇవ్వడానికి కృషి చేస్తానని, అర్హతలను బట్టి వారికి డబుల్ ఇళ్ల కేటాయింపులోనూ అవకాశం కల్పించడానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్మిక చట్టాల ప్రకారం వారికి రావాల్సిన అన్ని ప్రయోజనాలు అందేలా చూస్తానని, ప్రమాదవశాత్తూ మరణించిన లేదా అంగవైకల్యం పొందిన ఎలక్ట్రీషియన్ల కుటుంబాలకు ప్రభుత్వం నుంచిగానీ, కార్మికశాఖ నుంచి గానీ తగిన ఆర్థిక సాయం అందేలా కృషి చేస్తానని సబిత పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నక్క యాదగిరి, తెలంగాణ ఎలక్ట్రికల్ లైసెన్స్ బోర్డు మెంబర్ నేమాల బెనర్జీ, అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సామల శ్రీకాంత్‌రెడ్డి, గ్రేటర్ అధ్యక్షుడు పొదిల గోవర్ధన్, బాలాపూర్ మండల కమిటీ అధ్యక్షుడు కాశీనాయుడు, నిట్టల ప్రసాద్, వెంకటేశ్‌ముదిరాజ్, గోలి గిరి, ఆర్.శ్రీనివాస్‌నేత, దాసరి గిరి, ఆకుల వెంకటేశ్, శివన్న, బుచ్చిరెడ్డి, కార్పొరేటర్లు ఏను గు రాంరెడ్డి, స్వప్నావెంకట్‌రెడ్డి, లలితాకృష్ణ, దీపికాశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



గత ప్రభుత్వం ముదిరాజ్ ఆత్మగౌరవ భవన్ కోసం కోకాపెటలో కేటాయించిన 5 ఎకరాల స్థలాన్ని, ఏకపక్షంగా ఏర్పాటు చేసుకున్న ముదిరాజ్ డెవలప్‌మెంట్ ట్రస్ట్‌ను రద్దు చేసి ప్రజాస్వామ్య బద్దంగా తిరిగి ముదిరాజీలకే చెందేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలంగాణ ముదిరాజ్ జేఏసీ చైర్మన్ పాల్కం లక్ష్మీనారాయణ ముదిరాజ్, జేఏసీ మహిళా చైర్మన్ లింగాల పుష్పలత ముదిరాజ్‌లతో కూడిన బృందం బుధవారం తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖామాత్యులు పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. - చాదర్‌ఘాట్, ఆంధ్రజ్యోతి

వ్యవస్థీకృత వ్యభిచార నిర్వహణ విషయాలపై అవగాహన సదస్సు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి శ్రీదేవి

రంగారెడ్డి జిల్లా కోర్టులు, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : లైంగిక వృత్తి, వ్యవస్థీకృత వ్యభిచార నిర్వహణ విషయాలకు సంబంధించిన చట్టపరమైన అంశాలపై బుధవారం న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా న్యాయసేవాధికార సంస్థ, స్వాతి మహిళ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి వివిధ చట్టాలను క్లుప్తంగా వివరించారు. సుప్రీంకోర్టు లైంగిక వృత్తిపై ఇచ్చిన బుద్ధదేవ్ కర్మస్కర్ వర్సెస్ స్టేట్ ఆఫ్ పశ్చిమబెంగాల్ కేసులో తీర్పు గురించి వివరించారు. నల్సా స్కీమ్స్‌లను కూడా వివరించారు. కార్యక్రమంలో ఎల్బీనగర్ ఇన్‌స్పెక్టర్ రామాంజనేయులు, చైతన్యపురి ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, మహిళా అభివృద్ధి సంఘం ప్రాజెక్ట్ డైరెక్టర్ లలిత, మహిళా అభివృద్ధి సంఘం ప్రతినిధులు శ్యామలదేవి, అమితరాణి, రజనిదేవి, ప్యారాలీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

మీ భూములు మీకే.. అధికారుల వేధింపులు ఉండవు

● ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇస్తాం: మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్


దావూద్‌ఖాన్‌గూడ భూములను పరిశీలించిన అనంతరం మాట్లాడుతున్న కేఎల్లార్, పారిజాతారెడ్డి

సరూర్‌నగర్, జూలై 10(ఆంధ్రజ్యోతి): బాలాపూర్ మండలం బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని దావూద్‌ఖాన్‌గూడ సర్వే నంబర్.2లోని దళితుల భూమిని దళితులకే ఇస్తామని, వారికి రెవెన్యూ అధికారుల నుంచి ఎలాంటి వేధింపులు ఉండబోవని మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. తాము గతంలో సాగు చేసుకున్న భూమిని దొడ్డి దారిలో ఇతరులకు కట్టబెట్టడానికి కొందరు నేతలు ప్రయత్నం చేస్తున్నారని ఆరోపిస్తూ.. 'మా భూమి మాగ్గావాలె' అనే నినాదంతో అసెంబ్లీ ఎన్నికలకు ముందు దాదాపు వంద రోజుల పాటు స్థానిక దళిత కుటుంబాల సభ్యులు నిరవధిక నిరహార దీక్షలు చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో అప్పట్లో మహేశ్వరం కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన కేఎల్లార్ వారికి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు బుధవారం బడంగ్‌పేట్ మేయర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి, ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి, వై.అమరేందర్‌రెడ్డి తదితరులతో కలిసి దావూద్‌ఖాన్‌గూడ భూములను సందర్శించారు. ఈ సందర్భంగా దళిత రైతులు తమ ఆవేదనను ఆయనకు వివరించారు. అనంతరం కేఎల్లార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు దళితుల భూములు దళితులకే చెందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఇక్కడి దాదాపు 300 మంది కుటుంబాలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో పాటు ఇళ్ల నిర్మాణం కోసం రూ.5లక్షలు చొప్పున ఆర్థిక సాయం సైతం అందజేస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అమృతానాయుడు, పుట్టగల్ల జగన్, బి.గోవర్ధన్‌రెడ్డి, గట్టు బాలకృష్ణ, గుడ్ల శ్రీనివాస్, అనిత, పద్మ, అరుణ, శ్రీరాములు, దళిత రైతులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన శంకర్‌రెడ్డి


కిషన్‌రెడ్డిని సన్మానిస్తున్న శంకర్‌రెడ్డి

సరూర్‌నగర్ : కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జీ.కిషన్‌రెడ్డిని బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొలన్ శంకర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. రాష్ట్రంలో వచ్చే ఎన్నికల నాటికి బీజేపీని మరింత బలోపేతం చేసి, అధికారం చేపట్టే దిశగా ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలని ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నర్సింగ్‌రావు, పవన్‌కుమార్, హరీశ్, శ్రీరాములు పాల్గొన్నారు.

దాస్‌పైలాపై కఠినచర్యలు తీసుకోవాలి


డీసీపీ ప్రవీణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న వక్కలంక శ్రీనివాస్‌రావు

ఎల్బీనగర్, జూలై 10(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ సమాజంపై అనుచిత వ్యాఖ్యలు చేయడమే కాకుండా పరుష పదజాలంతో మాట్లాడిన పార్వతీపురానికి చెందిన దాస్‌పైలాపై కఠినచర్యలు తీసుకోవాలని తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ప్రాంతీయ కార్యదర్శి వక్కలంక శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో సమాఖ్య ప్రతినిధులు బుధవారం ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పార్వతీపురానికి చెందిన దాస్‌పైలా అనే వ్యక్తి ఫేస్‌బుక్ మాధ్యమం ద్వారా బ్రాహ్మణ సమాజాన్ని, బ్రాహ్మణులను అనుచిత వ్యాఖ్యలతో పరుష పదజాలంతో దూషిస్తున్నాడన్నారు. ఆయన మాట్లాడుతున్న తీరు వల్ల బ్రాహ్మణుల మనోభావాలు దెబ్బతింటున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి వారి వల్ల శాంతిభద్రతలు దెబ్బతినే ప్రమాదమున్నదన్నారు. ఆయన మాటలతో బ్రాహ్మణులను రెచ్చగొడుతున్నారన్నారు. డీసీపీని కలిసిన వారిలో తెలంగాణ బ్రాహ్మణసేవా సంఘ సమాఖ్య రాష్ట్ర మహిళా కార్యదర్శి జయతులసి, హైదరాబాద్ ఉపాధ్యక్షులు బనిగిరి నాగరాజ్, కోశాధికారి రఘునందన్, కార్యవర్గసభ్యులు ఎంవీ రమణారావు, నెప్పాలి శశి తదితరులు ఉన్నారు.

ఎల్ఐసీ చైతన్యపురి యూనిట్ అధ్యక్షుడిగా అంజిరెడ్డి

చంపాపేట: సీటీ16 చైతన్యపురి యూనిట్(1964) హైదరాబాద్ శాఖ 15వ ఆఫీస్ బేరర్ల కమిటీ నూతన అధ్యక్షుడిగా జీ.అంజిరెడ్డి, కార్యదర్శిగా టీ.దానయ్య, కోశాధికారిగా డీ.వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని లియాఫీ భవన్‌లో మంగళవారం రాత్రి బ్రాంచి అధ్యక్షుడు వీ.జంగయ్య అధ్యక్షతన జనరల్‌బాడీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో లియాఫీ అఖిల భారత సెక్రటరీ జనరల్ ఎస్‌బీ.శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు(హెచ్‌క్యూ)ఎంఎస్ మూర్తి, శ్రీరాం, భీష్మపితామహ బీఎన్‌చారి, డివిజన్ ప్రెసిడెంట్ చింతల వెంకట్‌రెడ్డి, సెక్రటరీ సుదర్శన్, కోశాధికారి శీనయ్య పాల్గొన్నారు.

ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడిగా హరిసింగ్‌నాయక్

అబ్దుల్లాపూర్‌మెట్: ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడిగా పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీకి చెందిన మాజీ కౌన్సిలర్ అజ్మీర్ హరిసింగ్‌నాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు శంషాబాద్‌లో నిర్వహించిన ఏఐటీయూసీ జిల్లా మహాసభలో హరిసింగ్‌నాయక్, ఆమనగంటి వెంకన్న ఉపాధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దాసరి ప్రసాద్, కేతరాజు నర్సింహ, వేముల శ్రీనివాససాగర్, ఏటూరి ఈశ్వర్, డవుల రాములు జిల్లా కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికయ్యారు.

అధికారుల దృష్టికి తెచ్చినా ఆగని హత్తిగూడచెరువు ఆక్రమణ

● చెరువును సందర్శించిన సీపీఐ నాయకులు


హత్తిగూడ చెరువును పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు, స్థానిక కాలనీల నాయకులు

హయత్‌నగర్, జూలై 10(ఆంధ్రజ్యోతి): హత్తిగూడ చెరువు ఆక్రమణకు గురవుతుందని అధికారుల దృష్టికి తీసుకువచ్చినా చెరువు ఆక్రమణ మాత్రం ఆగడం లేదని సీపీఐ హయత్‌నగర్ మండల కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం స్థానిక లక్ష్మీభవానీకాలనీ, బాలాజీనగర్‌కాలనీ, సీపీఐ నాయకులతో కలిసి ఆయన చెరువు ఎఫ్‌టీఎల్ ప్రాంతాన్ని సందర్శించారు. చెరువు ఎఫ్‌టీఎల్ ఆక్రమణకు గురవుతుందని కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్, జీహెచ్ఎంసీ లేక్ ఇరిగేషన్ ఏఈ దృష్టికి తీసుకువెళ్లినా ఆక్రమణ మాత్రం ఆగడం లేదని అన్నారు. గతంలో ఫిర్యాదు చేసినప్పుడు ఎఫ్‌టీఎల్ చుట్టూరా ఫెన్సింగ్ వేస్తామని చెప్పారని ఇంత వరకు ఏర్పాటు చేయలేదని అన్నారు. వారం రోజులుగా రియల్ వ్యాపారులు ఎఫ్‌టీఎల్ ప్రాంతాన్ని మట్టితో నింపి నిర్మాణాలు చేయడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. బాలాజీనగర్, క్రీడా ప్రాంతాల నుంచి వచ్చే వర్షం నీటిని దారి మళ్లించడానికి కల్వర్టును మూసి వేస్తున్నారని అన్నారు. భవన నిర్మాణ అనుమతులు, లేక్ డిపార్టుమెంటు ఎన్‌ఓలు ఉన్నాయని రియల్ వ్యాపారులు అంటున్నారని తెలిపారు. ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తామన్న అధికారులు అనుమతులు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. కల్వర్టును మూసి వేయడం వల్ల లక్ష్మీభవానీకాలనీతో పాటు పైన ఉన్న అన్ని కాలనీలు వరద నీటిలో మునిగిపోయే ప్రమాదం ఉందన్నారు. రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, లేక్ అధికారుల కనుసన్నలోనే హత్తిగూడచెరువు ఆక్రమణకు గురవుతుందని శేఖర్‌రెడ్డి ఆరోపించారు. లక్షలు చేతులు మారడం వల్లనే చెరువుకు రక్షణ లేకుండా పోతుందన్నారు. కలెక్టర్, జీహెచ్ఎంసీ కమిషనర్, లేక్ డిపార్టుమెంటు ఉన్నతాధికారులు హత్తిగూడచెరువు ఎఫ్‌టీఎల్‌లో ఇచ్చిన ఎన్‌ఓసీలపైన విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. ఉన్నతాధికారులు స్పందించని పక్షంలో ఆయా కార్యాలయాల ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి రమావత్ సక్రునాయక్, లక్ష్మీభవానీకాలనీ కార్యదర్శి నరేందర్, నాయకులు మహేందర్‌రెడ్డి, రాములు, నవీన్‌రావు, కృష్ణ, సరేందర్, శ్రీధర్‌రెడ్డి, రమేశ్, వెంకట్, గోవర్ధన్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించండి

సైదాబాద్, జూలై 10(ఆంధ్రజ్యోతి): మాదన్నపేట మార్కెట్ పరిసరాలలో అక్రమ పార్కింగ్, ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని, చర్యలు తీసుకోవాలని కోరుతూ భరత్‌నగర్ యూత్ అసోసియేషన్ సభ్యులు బుధవారం సంతోష్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నర్సింహనాయక్‌కు వినతిపత్రం అందజేశారు. రాత్రి వేళలో ఇతర జిల్లాలు, పొరుగు రాష్ట్రాల నుంచి వాహనాల లోడ్‌లతో నానా అవస్థలు పడుతున్నామని పేర్కొన్నారు. మార్కెట్ రోడ్లపై అక్రమ పార్కింగ్‌లతో ఉదయం వేళలో ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయని తెలిపారు. స్థానికులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అసోసియేషన్ సభ్యులు కట్టా సుదర్శన్, నాగరాజు, కుమార్, మహేంద్ర, కృష్ణ కోరారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

సరూర్‌నగర్, జూలై 10(ఆంధ్రజ్యోతి): నివాస ప్రాంతంలోని అపార్ట్‌మెంట్‌లో గుట్టు చప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న స్థావరంపై మీర్‌పేట్ పోలీసులతో కలిసి ఎల్బీనగర్ ఎస్వోటీ పోలీసులు దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లెలగూడలోని అర్పితా ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్‌లో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్టు అందిన సమాచారం మేరకు పోలీసులు సదరు ప్లాట్‌పై దాడి చేశారు. అక్కడ మూడు ముక్కలాట ఆడుతున్న వెంకట్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, అనిల్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, రమేశ్‌రెడ్డి, కర్ణాకర్‌రెడ్డి, కృష్ణమూర్తిలను అదుపులోకి తీసుకుని, వారి నుంచి నాలుగు సెట్ల ప్లేకార్డులు, రూ.25వేలు నగదు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

ఘనంగా కార్మికుల దినోత్సవం


చంపాపేట మోడల్ మార్కెట్ ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

చంపాపేట, జూలై 10(ఆంధ్రజ్యోతి): చంపాపేట మోడల్ మార్కెట్ కార్యాలయం ఎదుట బుధవారం కార్మికుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. అనంతరం కార్మికులు తమ సమస్యల సాధన కోసం నిరసన కార్యక్రమం చేపట్టారు. జీహెచ్ఎంసీ ఎంప్లాయీస్ యూనియన్ సీఐటీయూ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఆలేటి ఎల్లయ్య హాజరై మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన 4లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నల్ల వెంకయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు జంగయ్య, యాదమ్మ, జయమ్మ, మంజుల, పున్నమ్మ, బాలమ్మ, దేవమ్మ, మైసమ్మ, సంతోష, స్వరూప, కళావతి పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

సంతోష్‌నగర్, జూలై 10(ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ హైదరాబాద్ సౌత్‌జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రావణ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికుల డిమాండ్స్ డే సందర్భంగా బుధవారం సీఐటీయూ గ్రేటర్ హైదరాబాద్ సౌత్‌జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కార్మికుల సమస్యలపై ఐఎస్‌సదన్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకుడు కిషన్, జీహెచ్ఎంసీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు యాదమ్మ, లాలమ్మ, లక్ష్మయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ కాలనీలో ఇంటి తాళం పగులగొట్టి చోరీ

● 3 తులాల బంగారం, 25 తులాల వెండి, నగదు అపహరణ

కొత్తపేట, జూలై 10(ఆంధ్రజ్యోతి): నాగోల్ పీఎస్ పరిధి తట్టిఅన్నారం వైఎస్ఆర్‌కాలనీలో మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు ఇంటి తాళం పగులగొట్టి బంగారు, వెండి ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. అకునూరి సుదర్శన్, విజయ దంపతులు కొంత కాలంగా వైఎస్ఆర్‌నగర్ కాలనీలో ఉంటున్నారు. సుదర్శన్ తాగునీటి సరఫరా వ్యాపారం చేస్తున్నాడు. ఎప్పటి లాగే మంగళవారం రాత్రి కూడా ఇంటికి తాళం వేసి వారు రావినారాయణరెడ్డికాలనీ వద్ద వేసుకున్న గుడిసెల వద్ద పడుకునేందుకు వెళ్లారు. బుధవారం ఉదయం వైఎస్ఆర్‌నగర్‌కాలనీలో గల వారి ఇంటికి వచ్చారు. ఇంటి తాళం పగులగొట్టి ఉండడంతో ఇంట్లో దొంగలు పడ్డారని గుర్తించారు. లోనికి వెళ్లి చూడగా బెడ్రూంలో గల బీరువా తలుపులు తెరచి ఉంది. వెంటనే వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కుమార్తె పెళ్లి కోసం కొనుగోలు చేసి, దాచుకున్న 3తులాల బంగారు ఆభరణాలు, 25 తులాల వెండి పట్టీలు, ఇతర గొలుసులు, రూ 3.10 లక్షల నగదు గుర్తు తెలియని దుండగులు అపహరించుకుపోయారని గుర్తించారు. ఘటనా స్థలంలో దొరికిన గుర్తు తెలియని దుండగుల సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. విజయ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాఫిక్ నియమాలు పాటించండి.. ప్రమాదాలను నివారించండి


వైద్య సిబ్బందికి ట్రాఫిక్ అవగాహన కల్పిస్తున్న ఏసీపీ శంకర్‌రాజు

చాదర్‌ఘాట్, జూలై 10(ఆంధ్రజ్యోతి): వాహనంతో రోడ్డుపైకి వచ్చిన ప్రతి ఒక్క వాహనదారుడు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలు పాటించాలని, తద్వారా ప్రమాదాలు నివారించగలిగిన వారవుతారని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఏసీపీ జీ.శంకర్‌రాజు అన్నారు. బుధవారం మలక్‌పేటలోని యశోద ఆస్పత్రి వైద్య సిబ్బందికి రోడ్డు ప్రమాదాలు - నివారణ అనే అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ అనేది ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. అందుకు రహదారులపై విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదన్నారు. లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేస్తే రూ.5వేల జరిమానా, 3నెలల జైలు శిక్ష విధిస్తారన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, కారు డ్రైవింగ్ చేసేటప్పుడు సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో రిటైర్డ్ డీసీపీ దివ్యచరణ్, గోపాల్‌రావు, జీఎం ఆపరేషన్స్ హేమచంద్రబాబు, ఏజీఎం రాజశేఖర్ పాల్గొన్నారు.